❖•❖•❖ 30 ❖•❖•❖

# యేసు అవమానపర్చబడుట

*"వారు ఆయన వస్త్రములు తీసివేసి, ఆయనకు ఎఱ్ఱని అంగీ తొడిగించి ముండ్ల కిరీటములను అల్లి ఆయన తలకు పెట్టి, ఒక రెల్లు ఆయన కుడి చేతిలో నుంచి, ఆయన యెదుట మోకాళ్లూని – యూదుల రాజా, నీకు శుభమని ఆయనను అపహసించిరి" (మత్తయి 27:28, 29).*

మన ప్రభువు తన సిలువ మరణము కొరకు సిద్ధపడుచుండగా ఆయన వస్త్రములు తీసివేయబడిన విషయాన్ని నాలుగు సువార్తలు కూడ ఉల్లేఖించి చెప్పుచున్నవి (మత్తయి 27:28, 35; మార్కు 15:24; లూకా 23:34; యోహాను 19:23 చూడుము) దీనికి తోడు, ఆయన పైవస్త్రమును పంచుకొనుట కొరకు చీట్లు వేసికొనిరను సత్యము కీర్తనలు 22:18లో వ్రాయబడియున్న ప్రవచనమునకు ఒక ప్రత్యక్షమగు నెరవేర్పని యోహాను చెప్పుచున్నాడు:

> గనుక వారు – "దానిని చింపక అది ఎవనికి వచ్చునో అని దానికోసరము చీట్లు వేయుదమని" యొకరితో ఒకరు చెప్పుకొనిరి. "వారు నా వస్త్రములను తమలో పంచుకొని నా అంగీ కోసరము చీట్లు వేసిరి" అను లేఖనము నెరవేరునట్లు ఇది జరిగెను: ఇందుకే సైనికులు ఈలాగు చేసిరి (యోహాను 19:24).

కీర్తనలు 22:18 యేసుకు సిలువ యొద్ద చేయబడిన దాని ద్వారా మాత్రమే నెరవేరవలసి యుండిన ఒక నిర్దిష్టమైన ప్రవచనమైయుండినదని హ్యూగో మెక్‌కార్డ్ నమ్మాడు.

> ఈ ముందు సూచన ప్రవచనములన్నిటిలోను ఒక అత్యంత ఖచ్చితమైన ప్రవచనమై యున్నది. సిలువ వేయబడుటలో నలుగురు సైనికులుందురనియు, యేసు ఐదు వస్త్రములను ధరించియుండుననియు మొదలైన వివరాలు ముందుగానే ఎరిగియుండెనని చూచించుచున్నట్లు అగుపించుచున్నది. నాలుగు వస్త్రములు నలుగురు సైనికుల నడుమ పంచుకొనబడుట ఎంతో సుళువు, కానీ ఐదవ వస్త్రముతో చిక్కు వచ్చింది దానిని నాలుగు భాగాలు చేయుట వలన చక్కగా ధరించుకొనబడగల వస్త్రము, నాలుగు ముక్కలౌతుంది, సరికదా ధరించుకోడానికి ఎందుకూ పనికిరానిదౌతుంది. కనీసము ఎవరికైనా ఒకరికి ఉపయోగకరంగా ఉండునట్లు, చీట్లు వేయుట న్యాయసమ్మతమైన పరిష్కారమని సైనికులు ఆలోచించారు, గనుక చీట్లు వేసికొన్నారు.[1]

యేసు వస్త్రములకు సంబంధించిన ఐదు వస్తువులను సైనికులు భాగించుకొన్నారు, ఒక్కొక్క సైనికునికి ఒక వస్తువు వచ్చింది, అతుకులేకుండా ఒక్క ముక్కగా నుండిన పైవస్త్రము కొరకు నలుగురు సైనికులు చీట్లు వేసికొన్నారు. దీని గూర్చి డేవిడ్ స్మిత్ ఇలా చెప్పుచున్నాడు,

> ... ఒకనికి కండువా వంటీ పైవస్త్రము వచ్చింది, మరొకనికి దిసమొలకు చుట్టుకొను గోచీ గుడ్డ వచ్చింది, మూడవ వానికి పాదరక్షలు వచ్చాయి, నాల్గవవానికి ఆయన తలపాగా వచ్చింది. యిక మిగిలిందెల్లా లోదుస్తులు, లోపల ధరింపబడు ఒక విధమైన బిగుత్తైన వస్త్రము. వారు దానిని సహజంగానే నాలుగు భాగాలుగా చింపాలి, కానీ ఈ ఒక్క వస్త్రములో వారి దృష్టిని ఆకర్షించి వారి చేతులను కట్టివేసిన ఒక విశేషత ఉన్నది. అది అతుకులేకుండా, ఒకే ఒక్క ముక్కగా నేయబడిన వస్త్రము.[2]

నాల్గవది వాస్తవంగా నడుముకు ఉడుపై యుంటుంది; యేసు సిలువకు చేరుకునే సమయానికి ఆయనకు తలపాగా ఉండియుండదు. ఈ వాక్యభాగము గూర్చి మెక్‌కార్డ్ గారి అభిప్రాయము సరైనదైనట్లుయితే, యేసు సిలువవేయబడుటకు ఒక ఉపక్రమముగా ఆయన ధరించియుండిన వస్త్రములన్నియును తీసివేయబడ్డాయని సంపూర్తిగా అర్థమౌతుంది.

మన ప్రభువు సిలువ మరణమునకు సంబంధించినంత వరకు జరిగినదంతా ఏమిటో మనకు తెలియదు. సిలువ మరణ పద్ధతి గూర్చి వివరించిన రోమా రచయితలు నేరస్తుడు నగ్నంగా సిలువవేయబడ్డాడని వర్ణించారు. యూదులు వారు సిలువవేయుటలో భాగస్తులైయుండిన నేరస్థుని దిసమొల కనబడకుండునట్లు కప్పుటకు గోచి గుడ్డను యిచ్చారని, మనకు తెలియజెప్పబడుచున్నది.[3] అదే విధంగా, యేసు సిలువ వేయబడుచుండినప్పుడు దిసమొల చుట్టు ఒక గోచి గుడ్డను ధరించియున్నట్లు సర్వదా సాంప్రదాయిక చిత్ర కళ చిత్రీకరించినది.

యేసు నగ్నంగా సిలువవేయబడ్డాడా లేక అర్థనగ్నంగానా అన్నది ఎలా ఉన్నా, ఆయన శరీరము బహిరంగముగా బయట ప్రదర్శింపబడుట ఎంతో అవమానకరమైన అంశమై యున్నది. ఆయన పవిత్రత, ఆయన నైతిక గౌరవము, మరియు ఆయన పురుషత్వముపై చేయబడిన ఈ దాడిని వివరిస్తూ, “వారు ఆయన వస్త్రములు తీసివేసి, ...” అని ఆయనను సిలువవేసిన సైనికుని గూర్చి మత్తయి చెప్పుచున్నాడు (మత్తయి 27:28).

మన ప్రభువు సిలువ మీదికి ఎత్తబడుచుండినప్పుడు ఆయన మూడు విధములైన బాధననుభవించాడు: సిలువకు మేకులతో కొట్టబడుచుండగా కలిగిన శారీరక బాధ, మన పాపములను భరించుటద్వారా కలిగిన ఆధ్యాత్మిక బాధ, మరియు బాహాటముగా అవమానపర్చబడుచుండినందువలన కలిగిన భావావేశ బాధ, మొదటి ఆదాము దేవుని యెడల చూపిన అవిధేయతను బట్టి ఆయన ఏదెను తోటలో శారీరక మరియు నైతిక నగ్నత్వమును అనుభవించాడు; రెండవ ఆదాము వస్త్రహీనతనుబట్టి కలిగిన అవమానమును అనుభవించుచు శ్రమనొందుచుండిన పాపిష్ఠి శరీరమును తానే ధరించాడు.

*అది సూచించుచున్న గుర్తింపు.* మన ప్రభువు ఈ విధంగా అవమానపర్చబడుటలో ఆయన సంపూర్తిగా మన మానవ పరిస్థితితో గుర్తించుకొనుటను మనము చూడగలము. కన్య మరియ గర్భములో జన్మించినప్పుడు ఆయన దాదాపు మానవుడుగా కాలేదు; ఆయన నిజముగా మానవుడయ్యాడు. మన వలెనే ఆయనకు శరీరముండినది – రక్తమాంసములుండిన శరీరము, ఆ శరీరములో నివసించుచుండిన వాని గౌరవమును కాపాడుకొనుటకు వస్త్రములు ధరించవలసి యుండిన ఒక శరీరముండినది. ఆయన దేవుడే కాదన్నట్లుగా సంపూర్తి మానవుడైయుండెను. ఆయన హస్తము గాయపర్చపడినప్పుడు, రక్తము కారింది;

నగ్నంగా లేదా కేవలము దిసమొలను కప్పుతూ కట్టబడిన గోచీ గుడ్డతో అర్థనగ్నంగా సిలువవేయబడిప్పుడు, మనలో ఎవరమైనా అనుభవించు అవమానమునే, నగ్నంగా ఉండుట వలన కలుగు అవమానమును, ఆయన కూడ అనుభవించాడు.

*అది తలపింపజేస్తున్న బలియాగము.* సైనికులు క్రీస్తు ధరించి యుండిన వస్త్రములను తీసివేసి ఒళ్లు గగుర్పాటు కలిగించిన ఈ చర్యలో మన ప్రభువు మానవులమైన మన రక్షణార్థమై తన మానవ గౌరవమును బలిచేయుటకు ఇష్టపూర్వకంగా సంసిద్ధుడై యుండెనని చూచుచున్నాము. శరీరధారియై మనుష్యుడగుటలో గల అత్యంత లోతైన అర్థమును కలువరి గిరపై చూడవచ్చును. “ఆ వాక్యము శరీరధారియై, ... మన మధ్య నివసించెను” అని యోహాను చెప్పుచున్నాడు (యోహాను 1:14ఎ). క్రీస్తు “మనుష్యుల పోలికగా పుట్టెను” అని పౌలు చెప్పుచున్నాడు (ఫిలిప్పీయులకు 2:7). ఆయన సంపూర్తిగా మానవులమైన మనలో ఒకడయ్యాడు.

ఆయన అనుభవించిన బాధను ఒక్కసారి సింహావలోకనము చేసికొనండి: ఆయన తన స్వకీయుల చేత తృణీకరింపబడ్డాడు, మానవుల చేత శపింపబడిన వాడయ్యాడు, శ్రమనొందుచు తనతో కూడ ఉండిన సహచరుల చేత అపహసింపబడ్డాడు. ఇంకా, నిర్ణయాత్మకంగా కొరడాతో కొట్టబడ్డాడు, కాళ్ళు చేతులలో మేకులు దిగగొట్టబడ్డాయి, జ్వరము వచ్చినట్లు ఒళ్లు వేడెక్కినందువలన దాహమేసింది, చిత్రవధకు గురైన కండరాలు చిల్లులు పొడవబడిన శరీర భారమును భరిస్తూ తీవ్రంగా కంపించాయి, మరియు బలముతో లాగబడి చిత్రవధచేయబడుచుండిన శారీరక బాధ నుండి విముక్తి చేయబడాలను వాంఛ కలిగింది. ఏది ఏమైనా, బట్టలు తీసివేయబడి బహిరంగంగా కలిగించబడిన అవమానమును మనము చూసీచూడనట్లుండ కూడదు. చాటుగా నుండినదియు సచ్ఛీలమునకు సంబంధించినదైన ఈ ఆచ్ఛాదనమును తీసివేయుట ఆది పరిశుద్ధులు అత్యధికంగా భయపడిన బలియాగము యొక్క ఒక పార్శ్వమై యుండినది. ఇలా దిగంబరులనుగా చేయుట చిత్రహింసలు పెట్ట బడినందువలన మరణించుట కంటే మరీ ఘోరమైన అవమానమని వారిలో కొందరు ఎంచారు. నిశ్చయంగా యేసు కూడ సిలువ మరణములోని ఈ భాగము గూర్చి భయము చెందియుంటాడు.

*అది చిత్రీకరించుచున్న మరణము.* యేసు అవమానపరచబడ్డాడను వాస్తవము క్రీస్తు సిలువవేయబడుట ఘోరాతి ఘోరమైన రక్తసిక్తమైనది, హీనమైనది, బాధకరమైనది, మరియు రోధనయైన మరణమని మనకు మరలా గుర్తుచేయుచున్నది. *ది ప్యాషన్ ఆఫ్ ద క్రైస్ట్,* 2003లో లక్షలాది మంది ప్రజల చేత వీక్షింపబడిన ఒక చలనచిత్రము, యేసు రక్తమును, శారీరక శ్రమను, మరియు చిత్రహింసను విడమర్చి, కళ్లకు కట్టినట్లుగా సినీమా రంగంలోని రంగురంగులతో చిత్రీకరించినది. ఏదిఏమైనా, పరిపూర్ణుడును, పవిత్రుడును, దైవీకమైనవాడైన క్రీస్తు వహిస్తు సహించిన వాస్తవమైన అవమానమును మనము ఒక వెండి తెరపై చూపించగలమని మనము ఒక్క క్షణమైనా ఆలోచిస్తామా? దేవుని అవమానమును మానవ మనస్సులు వరించగలవా? యేసును సిలువవేసినవారు వారు ఊహించుకొనగలిగినట్లు ఆయనతో ఘోరాతిఘోరమైన రీతిలో వ్యవహరించారు. వారు జాప్యమౌతూ, చీకాకు కలిగించుచు, యాతనపెట్టు మరణమును కోరారు, మానవ శరీరము మరియు మనస్సు ఈ బాధను ఎంత వరకు అనుమతించగలిగితే అంతవరకు పొడిగించాలని ఆశించారు,

నేరస్థునిలో గౌరవముగాని ఆత్మాభిమానముగాని లేశమైనా లేనంత వరకు వానిని మొత్తానికే అవమానపర్చాలని వారాశించారు. శారీరక గౌరవమేదైనా, చూడదగు మంచి మర్యాద ఏదైనా అది సిలువపై కుమ్మరించబడింది. ఆయనకు వ్యక్తిగతముగా విలువైన సమస్తమును ఆయనలో నుండి తీసివేయాలని మన రక్షకుని చంపుచుండిన శత్రువులు వెదకారు.

*అది వర్ణించు మూల్యము.* మన రక్షణ దైవికమైన మహిమ చేత కాదు గాని, దైవికమైన అవమానము మరియు నిందాజనక నీచము చేత కొనబడిందని మనము చూడగలము, దేవుడు నిత్య జీవమును దూతలు పాటలు పాడుచుండగా యేసు సూర్యుని వెలుగును మించిన మహిమతో నింపబడి సింహాసనాసీనుడైయున్న భయభీతిని గొలుపు సన్నివేశముతో తీసుకరాలేదు. లేదు, నిజముగా అలా కాదు! మనకు రక్షకుడగుటకు, యేసు వాస్తవమైన మానవత్వ ప్రతి కోణంలోను మానవులమైన మనలో ఒకడయ్యాడు. మన మనుభవించుచున్న సమస్త కష్టసుఖాలను ఎదుర్కొంటూ, మనకున్న పరిమితులతోనే ఆయన జీవించాడు. చివరకు, ఊహించుకొనజాలని ఘోరాతిఘోరమైన నానావిధ చిత్రహింసలకును మానసిక అవమానమునకును ఆయనను గురిచేయుటకు వారిని అనుమతిస్తూ, క్రూరులైన యూదా నాయకులు మరియు రోమా సైనికుల హస్తాలకు తననుతాను అప్పగించుకొన్నాడు.

యేసు మనకు ఏమేమి చేశాడో అని మనము చేయుచున్న అధ్యయనములో, మనము తరుచుగా సిలువ మరణముపై మాత్రమే – ఆయన శరీరమును చీల్చి వేయుచు దాని గుండా దూసుకుపోతున్న మేకులు మరియు “సమాప్తమైనది!” అను కేకతో దుర్భరమైన ఆరు గంటల శ్రమపైనే – మన దృష్టిని కేంద్రీకరిస్తాము. ఏదిఏమైనా, ఆయన సిలువమరణమునకై చేయబడిన ఏర్పాట్లను – తీవ్రమైన తన దుఃఖమునకు మరియు చింతకు కొలవబడజాలనంతటి బాధను చేర్చినవైన క్రీస్తును కొరడాతో కొట్టుట, ఆయనను వస్త్రహీనునిగా చేయుట, మరియు ఆయనను అపహాస్యము చేయుట – మనము మర్చిపోరాదు. మనము దేవుని నీతిని ధరించగలుగునట్లు ఆయన ధరించియుండిన వస్త్రములు తీసివేయబడ్డాయి; మనము లోపటను వెలుపటను దేవుని మహిమతో కప్పబడునట్లు ఆయన లోకము యెదుట నగ్నంగా ప్రదర్శింపబడ్డాడు.

❖◆❖◆❖

*క్రీస్తు తన గొప్పతనమును విడిచిపెట్టకూడని భాగ్యమని ఎంచక తనను తాను తగ్గించుకొని దిగివచ్చుటలో కేవలము ఆయన ఒక మానవుడగుట మాత్రమే కాదు, కానీ ఘోరాతిఘోరంగా ఒక మానవుడు అనుభవించగల అవమానమును అనుభవించుట యను అర్థము కూడ ఇమిడి యున్నది.*

---

సూచనలు

[1]Hugo McCord, *Messianic Prophecy* (Nashville: 20th Century Christian, 1967), 24. [2]David Smith, *The Days of His Flesh: The Earthly Life of Our Lord and Saviour Jesus Christ,* 5th ed. (London: Hodder and Stoughton, 1906), 497. [3]*The Gospel of Nicodemus* x.